# రుణమాఫీకి కొర్రీలెన్నో!

మొదటిపేజీ తరువాయి...

డిసెంబర్ 9 వరకు ఉన్న స్వల్పకాలిక పంట రుణాలను మాత్రమే మాఫీ చేయనున్నట్టు స్పష్టం చేసింది. బ్యాంకుల నుంచి రైతుల, రుణాల వివరాలను ప్రత్యేక పోర్టల్ ద్వారా సేకరించనున్నారు. ఇందుకోసం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించి దీని ద్వారా రుణమాఫీ చేస్తారు. ప్రతి బ్యాంకు నుంచి ఒక నోడల్ అధికారిని నియమిస్తారు. ఈ అధికారి ఇటు వ్యవసాయ శాఖ, అటు ఎన్ఐసీ(పోర్టల్)కి అవసరమైన సమాచారం అందిస్తారు. రుణమాఫీలో రైతులకు ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులు, సందేహాలను తీర్చేందుకు పోర్టల్ ద్వారా, మండల స్థాయిలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది.



### మార్గదర్శకాల్లోని ముఖ్యాంశాలు

- భూమి కలిగిన ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల వరకు గల స్వల్పకాలిక పంట రుణాలను మాఫీ వర్తిస్తుంది.
- 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 మధ్య రుణాలు తీసుకున్న, రెన్యువల్ చేసిన రైతులకు మాత్రమే రుణమాఫీ.
- కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకొని రూ.2 లక్షలు (అసలు, వడ్డీ కలిపి) రుణమాఫీ.
- తెల్ల రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబాన్ని నిర్ధారిస్తారు. అందరి ఆధార్ నంబర్లను లింకు చేసి కుటుంబాన్ని గుర్తిస్తారు.
- రుణమాఫీ డబ్బులు నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమవుతాయి.
- అందరికీ ఒకేసారి రుణమాఫీ చేయరు. తక్కువ రుణం తీసుకున్న వారికి ముందుగా మాఫీ చేసి ఆ తర్వాత క్రమంగా ఎక్కువ మొత్తం తీసుకున్న వారికి మాఫీ చేస్తారు.
- ఒక కుటుంబానికి 2లక్షలకుపైగా రుణం ఉంటే..ఎక్కువ ఉన్న రుణాన్ని మొదట రైతులు బ్యాంకుకు చెల్లించాకే రుణమాఫీ వర్తిస్తుంది.
- ఒక కుటుంబంలో రూ.2 లక్షల కన్నా ఎక్కువ రుణం ఉంటే మొదటగా కుటుంబంలోని మహిళ పేరుపై ఉన్న రుణాన్ని మాఫీ చేస్తారు. ఆ తర్వాత అర్హత ఉంటే పురుషుల పేరుపై రుణాన్ని మాఫీ చేస్తారు.
- ఒకవేళ అనర్హులైన రైతులకు రుణమాఫీ జరిగితే ఆ మొత్తాన్ని రైతుల నుంచి తిరిగి రికవరీ చేయనున్నారు.

### వీరికి రుణమాఫీ వర్తించదు

- రుణమాఫీకి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం కిసాన్ నిబంధనలను వీలైనంత వరకు అమలు చేయనున్నారు. దీంతో ప్రస్తుతం పీఎం కిసాన్ అందుకోలేనివారికి రుణమాఫీ వర్తించే అవకాశం లేదు.
- ఎస్‌హెచ్‌జీలు, జెల్‌జీలు, ఆర్ఎంజీలు, ఎల్ఈసీఎస్‌లకు తీసుకున్న రుణాలకు రుణమాఫీ వర్తించదు.
- రీషెడ్యూల్ చేసిన రుణాలకు కూడా రుణమాఫీ వర్తించదు.
- కంపెనీలకు, ఫర్మ్స్ వంటి సంస్థలకు ఇచ్చిన పంట రుణాలకు వర్తించదు. అయితే ప్రాథమిక సహకార సంఘాల ద్వారా తీసుకున్న రుణాలకు మాత్రం వర్తిస్తుంది.



## వలపోతలను వదిలి వడపోతలపైనే దృష్టి

- **మాజీ మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ అమలు విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను పరిశీలిస్తే, రైతుల వలపోతల కంటే వడపోతలపైనే ఎక్కువ దృష్టి పెట్టినట్టు స్పష్టమవుతున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చాక ఒక మాటగా చెప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని ఎక్స్‌వేదికగా మండిపడ్డారు. డిసెంబర్ 12, 2018 కంటే ముందున్న రుణాలకు రైతు రుణమాఫీ వర్తించదనే నిబంధన అసమంజసమని పేర్కొన్నారు. రైతుకు రుణ భారం తగ్గించే ప్రయత్నం కన్నా ప్రభుత్వ భారం తగ్గించుకునే ప్రయత్నమే కనిపిస్తున్నదని విమర్శించారు. ఆహార భద్రతకార్డు, పీఎం కిసాన్ పథకం ప్రామాణికం అని ప్రకటించడం అంటే లక్షలాది రైతుల ఆశలపై నీళ్లు చల్లడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## కుటుంబాన్ని నిర్ణయించడానికే తెల్లరేషన్ కార్డు

- **మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ పథకంలో తెల్ల రేషన్‌కార్డు అనేది కేవలం కుటుంబాన్ని నిర్ణయించడానికి ప్రామాణికమేనని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టంచేశారు. ప్రభుత్వం దగ్గర అందరి వివరాలు ఉన్నాయని, కుటుంబ నిర్ధారణ కాగానే రుణమాఫీని మిగతా వారికీ వర్తింపచేస్తామని తెలిపారు. 2018లో అవలంబించిన విధానాలే 2024లో అమలు చేస్తున్నామని చెప్పారు. రుణమాఫీ కింద రూ.20 వేల కోట్లు ప్రకటించి రూ.13 వేల కోట్లు విడుదల చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఆరు నెలల్లోనే, ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుంటే హర్షించాల్సింది పోయి విమర్శించడం సరికాదని పేర్కొన్నారు.

# సందేహాలెన్నో.. స్పష్టతే లేదు!

- **రుణమాఫీ మార్గదర్శకాలతో గందరగోళం**

హైదరాబాద్, జూలై 15(నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీకి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు అనేక సందేహాలు రేకెత్తిస్తున్నాయి. కానీ, వాటికి జవాబులే దొరకడం లేదు. దీంతో రుణమాఫీ మార్గదర్శకాలు రైతుల్లో అనేక భయాలు, గందరగోళం సృష్టిస్తున్నాయి.

### రేషన్‌కార్డు లేని వారి పరిస్థితి ఏమిటి?

రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబాన్ని లింకు చేసి రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయంతో రేషన్‌కార్డుల్లో పేరు ఉన్నవారికి కొంత నష్టం జరిగినా, ఎంతో కొంత అప్పు తీరుతుంది. అయితే, రేషన్‌కార్డు లేని వారి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. కొందరు రైతులు పంట రుణం తీసుకున్నారు. కానీ, వారికి రేషన్‌కార్డు లేదు. ఇప్పుడు వారిని ఏ విధంగా గుర్తిస్తారు? వారికి రుణమాఫీ చేస్తారా? లేదా? అనే ప్రశ్నకు జవాబు లేదు.

### గోల్డ్‌లోన్ రుణమాఫీ లేనట్టే

రైతులు పంట సాగు కోసం బ్యాంకుల్లో పాస్‌బుక్‌లతోపాటు బంగారాన్ని తాకట్టు పెట్టి పంట రుణం తీసుకుంటారు. దీనిని కూడా బ్యాంకులు పంట రుణం కిందనే భావిస్తాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ తరహా రుణాలను కూడా మాఫీ చేసింది.కాంగ్రెస్ ప్రభుత్వం పాస్‌పుస్తకాలతోపాటు బంగారాన్ని తాకట్టు పెట్టి తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయడం లేదు. బంగారంపై తీసుకున్న రుణాల మాఫీపై నిబంధనల్లో ఎక్కడా పేర్కొనలేదు. ఈ విధంగా ఆ రైతులకు రుణమాఫీలో ప్రభుత్వం మొండి చెయ్యి చూపినట్టే.

### ఎక్కువ రుణం చెల్లించిన తర్వాతే రుణమాఫీ

ఒక కుటుంబానికి రూ.2 లక్షల కన్నా ఎక్కువ రుణం ఉంటే.. ఎక్కువ ఉన్న మొత్తాన్ని రైతులు ముందుగా చెల్లించాలని షరతు పెట్టింది. రైతులు ఆ డబ్బులు చెల్లించిన తర్వాతే రూ.2 లక్షలు మాఫీ చేస్తామని స్పష్టంచేసింది. ఈ నిబంధన రైతులపై భారాన్ని మోపడమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక రైతు రూ.3 లక్షల రుణం తీసుకున్నట్టయితే, ఆ రైతు రుణమాఫీకి ముందే రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుంది. అంత మొత్తం చెల్లించడం రైతుకు ఇబ్బందే. అసలు, వడ్డీ కలిపి రూ.2 లక్షలకు మించినా ఇదే నిబంధన వర్తిస్తుందా? అనే సందేహాలున్నాయి. నిర్దిష్ట రుణం ఎక్కువ మొత్తాన్ని రైతులు చెల్లించారో లేదో తెలుసుకునేందుకు మరో జాబితా తెప్పించుకోవాలి. ఇది రుణమాఫీని ఆలస్యం చేసే అవకాశం ఉన్నది. ప్రభుత్వం చేసే మాఫీకి, అదనపు మొత్తం చెల్లింపులకు లింకు పెట్టడంపై విమర్శలొస్తున్నాయి.

### ఆరోహణ క్రమం అంటే.. ?

ఆరోహణ క్రమంలో రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం పేర్కొన్నది. అంటే తక్కువ నుంచి ఎక్కువకు రుణమాఫీ చేస్తుంది. అయితే దీనిపై నిబంధనల్లో స్పష్టత ఇవ్వలేదు. తొలుత ఎంత మొత్తం నుంచి రుణమాఫీ మొదలు పెడుతుంది? ఎప్పటి నుంచి మొదలుపెడుతుంది? ఎప్పటి వరకు పూర్తి చేస్తుంది? అనే అంశాలపై స్పష్టత ఇవ్వలేదు. అరోహణ క్రమంలో అంటే ఎంతెంత మొత్తం ఎప్పుడు చేస్తారో స్పష్టత లేదు.

## రుణమాఫీకి ఇన్ని నిబంధనలు ఎందుకు?

**బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి**



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పుడు ఇన్ని నిబంధనలు ఎందుకు విధిస్తున్నారని బీజేపీ ఎల్పీనేత ఏలేటి మహేశ్వరరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రేషన్‌కార్డు నిబంధన పెట్టి చాలా మందికి రుణమాఫీ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.రీ షెడ్యూల్ అయిన రుణాలకు మాత్రమే రుణమాఫీ ఇస్తామనడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిబంధనలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు గ్రామపంచాయతీలకు, పట్టణ స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయాలంటూ లేఖ రాశారు.

# రుణమాఫీపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం



- **2 లక్షల రుణమాఫీ పొందే రైతులెందరు?**
- **రేషన్‌కార్డులులేని రైతుల పరిస్థితి ఏమిటి?**
- **మార్గదర్శకాల పేరుతో రైతును మభ్యపెట్టే ప్రయత్నాలు**
- **తెల్లకార్డుపై నాలుక మడతేసిన సీఎం రేవంత్‌రెడ్డి**
- **కేసీఆర్ చేసిన రుణమాఫీ 29,144.61 కోట్లు**
- **కాంగ్రెస్ సర్కార్ చేసే మాఫీ ఎంత?**
- **మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నిలదీత**

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రూ.2 లక్షల రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, మార్గదర్శకాల పేరుతో రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నదని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. రుణమాఫీకి తెల్ల రేషన్‌కార్డు ప్రామాణికం కాదని ఇటీవల పేర్కొన్న సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు రోజులు తిరగకుండానే నాలుక మడతేశారని విమర్శించారు. రేషన్‌కార్డులేని రైతుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. ప్రభుత్వ మార్గదర్శకాలు కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. మార్గదర్శకాలు అధికారులు, రైతుల మధ్య చిచ్చుపెట్టేలా ఉన్నాయని, అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగేలా ఉన్నాయని దుయ్యబట్టారు. రుణమాఫీపై రైతుల నుంచి ఫిర్యాదులను కోరడం వెనుక రైతుల మధ్య వివాదాలను సృష్టించే ఎత్తుగడ ఉన్నదని ఆరోపించారు. రుణమాఫీ ఆశచూపి అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం హామీల నుంచి తప్పించుకునేందుకు సాకులు వెతుకుతున్నదని మండిపడ్డారు. సర్కారు దగ్గర కిసాన్ డాటా ఉంటే రుణమాఫీ అమలుకు వ్యవసాయ శాఖ అధికారులను బాధ్యులను చేయడం ఎందుకు? రైతుల నుంచి ఫిర్యాదులు ఆహ్వానించడం ఎందుకు? అని ప్రశ్నించారు. 'డిసెంబర్ 9నే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం. పూచీ నాది. రుణాలు తెచ్చుకోనివారు పరుగెత్తి తెచ్చుకోండి' అని ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి మార్గదర్శకాల పేరుతో రైతులకు ఇప్పుడు చావుకబురు చల్లాగా చెప్పారని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు చేసిన మోసానికి రైతులు తప్పకుండా గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వం అసలు రుణమాఫీయే చేయలేదని కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు రుణమాఫీ అమలు చేశామనే పేరు కోసం, ప్రచారం కోసం తప్ప రైతుల మేలుకోరేవి కావని స్పష్టంచేశారు. రాష్ట్రంలో రూ.2 లక్షల రుణం పొందిన రైతులు ఎంతమంది ఉన్నారో వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పీఎం కిసాన్ డాటాను అనుసరించడం అంటే రుణమాఫీ లక్ష్యానికి గండికొట్టడం, రైతాంగాన్ని వంచించడమేనని మండిపడ్డారు.

### కేసీఆర్ చేసిన రుణమాఫీ 29,144 కోట్లు

రాష్ట్రంలో వ్యవసాయం, రైతాంగం బాగుండాలి తద్వారా ఉపాధి అవకాశాలు లభించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలుచేసిందని నిరంజన్‌రెడ్డి గుర్తుచేశారు. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత కరంటు, సాగునీళ్లు, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాలను అమలుచేశామని వివరించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో రైతులు, వ్యవసాయమే ఇరుసుగా పనిచేసిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో పడిన రైతుల రుణభారాన్ని తొలగించడం ద్వారానే రైతులు కుదుటపడతారని, వ్యవసాయం సుస్థిరం అవుతుందని భావించి కేసీఆర్ రెండు విడతలుగా రుణమాఫీ చేశారని చెప్పారు. మొదటి విడతలో 35.31 లక్షల మంది రైతులకు రూ.16,144.10 కోట్లు, రెండో విడతలో 22,98,039 రైతులకు చెందిన రూ.13,000.51 కోట్లు రుణమాఫీ చేశామని వివరించారు. ఎన్నికల కోడ్ వచ్చే వరకు కేసీఆర్ ప్రభుత్వంలో రూ.6,440 కోట్లు మిగిలిపోయిందని చెప్పారు. రెండు విడతల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.29,144.61 కోట్లు రుణమాఫీ చేసిందని తెలిపారు. రైతు కుటుంబాలను గుర్తించేందుకే రేషన్ కార్డును పరిశీలించామని, కాంగ్రెస్ సర్కారు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 10 ఎకరాలుండి గులాబీ కార్డు ఉన్న రైతులందరికీ వర్తించదా? అని ప్రశ్నించారు.

# రుణమాఫీ సగం మందికే!

- **ప్రభుత్వ కొర్రీలతో దూరంకానున్న లబ్ధిదారులు**


హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): 'మీరు పంట రుణాలు రెన్యువల్ చేసుకోండి. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అందరి రుణాలను మాఫీ చేస్తాం.' 'ఆగస్టు 15లోగా రైతులందరినీ రుణ విముక్తులను చేస్తాం.'.. ఇవీ ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నేతలు వల్లెవేసిన వ్యాఖ్యలు. కానీ, సోమవారం విడుదల చేసిన రుణమాఫీ మార్గదర్శకాల ప్రకారం అవన్నీ గాలిమాటలేనని, రుణమాఫీ సగం మందికి కూడా అందడం కష్టమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. గణాంకాలతో సహా వివరిస్తున్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో 69 లక్షల మంది రైతులు ఉన్నారు. ఇందులో సుమారు 55 లక్షల మంది పంట రుణాలు తీసుకున్నట్టు వ్యవసాయ శాఖ వర్గాల అంచనా. రుణమాఫీకి పీఎం కిసాన్ యోజన మార్గదర్శకాలను అమలుచేస్తామని ప్రభుత్వం చెప్తున్నది. ప్రస్తుతం రాష్ట్రంలో పీఎం కిసాన్ యోజన లబ్ధిదారులు 33 లక్షల మంది ఉన్నారు. ఈ డాటాను చివరగా 2019లో అప్‌డేట్ చేశారు. అప్పటినుంచి ఈ పథకానికి అర్హులైన వారి సంఖ్య ఐదేండ్లలో మరో ఐదు లక్షల వరకు పెరిగి ఉంటుందని అంచనా. ఈ లెక్కన పీఎం కిసాన్ నిబంధనలకు అనుగుణంగా 38 లక్షల మంది వరకు ఉంటారని భావిస్తున్నారు. కుటుంబాన్ని నిర్ధారించేందుకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటామని ప్రభుత్వం చెప్తున్నది. ఈ లెక్కన 38 లక్షల మందిలోనూ రేషన్‌కార్డు లేనివారికి రుణమాఫీ దక్కదు. కొత్త రేషన్‌కార్డులు రాకపోవడం వల్ల ఇప్పటికీ లక్షల కుటుంబాలు ఒకే కార్డులో ఉన్నాయి. ఇలా దాదాపు 10 లక్షల మంది వరకు రుణమాఫీకి దూరం అవుతారని వ్యవసాయ శాఖ వర్గాలు చెప్తున్నాయి. అంటే సుమారు 28 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ దక్కనున్నదని వ్యవసాయ, ఆర్థిక శాఖల నిపుణులు పేర్కొంటున్నారు. రుణం తీసుకున్న 55 లక్షల మందిలో సగం మందికి మాత్రమే రుణమాఫీ అందే అవకాశం ఉన్నదని స్పష్టం చేస్తున్నారు. 'సాధారణంగా ప్రభుత్వాలు ఒక సంక్షేమ పథకాన్ని అమలు చేసేటప్పుడు వీలైనంత ఎక్కువ మందికి ప్రయోజనం కలిగేలా అర్హతలు నిర్ణయిస్తుంటాయి. కానీ, రుణమాఫీ మార్గదర్శకాల్లో వీలైనంత ఎక్కువ మందిని అనర్హులను చేసేందుకే నిబంధనలు పెట్టినట్టున్నది' అని ఒక బ్యాంకర్ పేర్కొన్నారు.

## కఠినంగా పీఎం కిసాన్ నిబంధనలు

- **అనర్హులుగా రిటైర్డ్, ప్రస్తుత ప్రభుత్వ ఉద్యోగులు**

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకం నిబంధనలు అత్యంత కఠినంగా ఉన్నాయి. ఈ నిబంధనల కారణంగా చాలామంది ఈ పథకానికి అనర్హులవుతున్నారు. 2019 ఫిబ్రవరి 1వ తేదీ నాటికి అర్హత పొందినవారికి మాత్రమే ప్రస్తుతం ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు. మళ్లీ నాటి నుంచి ఐదేండ్ల వరకు నిబంధనలు మార్చేందుకు అవకాశం లేదు. ఇలాంటి కఠిన నిబంధనలను ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీకి అమలు చేయాలని నిర్ణయించింది. రుణమాఫీ అమలుకు ఈ నిబంధనలను వీలైనంత మేరకు వర్తింపచేయాలని నిర్ణయించింది. దీంతో రుణమాఫీకి లక్షల మంది అనర్హులయ్యే ప్రమాదం ఏర్పడింది. రిటైర్డ్, ప్రస్తుత ప్రభుత్వ ఉద్యోగులు ఈ నిబంధనల వల్ల అత్యధికంగా నష్టపోయే అవకాశం ఉన్నది.





### పీఎం కిసాన్‌కు అనర్హులు

- రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారికి ఈ పథకం వర్తించదు. ప్రస్తుతం పదవుల్లో ఉన్నవారితోపాటు మాజీలకు ఈ పథకం వర్తించదు. మాజీ, ప్రస్తుత మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జడ్పీ చైర్మన్లు ఈ పథకానికి అనర్హులు. రిటైర్డ్, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా పీఎం కిసాన్ వర్తించదు.
- అనర్హుల జాబితాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారు, ప్రభుత్వ ఆధీనంలో ని స్వతంత్ర సంస్థల్లో పని చేసే వారు, స్థానిక సంస్థల్లోని ఉద్యోగులు ఉన్నారు.
- ఉద్యోగాల్లో రిటైర్డ్ అయి ప్రతి నెల రూ.10 వేల కన్నా ఎక్కువగా పెన్షన్ తీసుకునేవారూ పథకానికి అనర్హులే.
- ఆదాయపు పన్ను(ఐటీ) చెల్లించేవారు కూడా ఈ పథకానికి అనర్హులు.
- డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్ట్స్‌కు పీఎం కిసాన్ వర్తించదు.
- ఎన్ఆర్ఐ కుటుంబాలకు వర్తించదు.

# లేని రేషన్‌కార్డులతో రుణమాఫీకి లింకా?

- **కొన్నేండ్లుగా కొత్త రేషన్‌కార్డుల మంజూరు లేదు**
- **కార్డుల్లో కుటుంబీకుల చేరికలు, తొలగింపూ లేదు**
- **రేషన్‌కార్డుల కోసం లక్షల మంది ఎదురుచూపులు**
- **కొత్తవి ఇవ్వకుండానే రుణమాఫీకి రేషన్‌కార్డు లింకు**
- **ప్రభుత్వ తీరుతో అనర్హులుగా లక్షల కుటుంబాలు**



హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఒక కుటుంబంలో ఇద్దరు కొడుకులున్నారు. వారికి వివాహమై వేరుగా ఉంటున్నారు. తల్లిదండ్రులు, కొడుకులు ఎవరికి వారు వేర్వేరుగా వ్యవసాయం చేసుకుంటున్నారు. ఎవరి పట్టాదార్ పాస్‌బుక్‌పై వారు తలా రూ.1.5 లక్షల రుణం తీసుకున్నారు. అయితే కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకపోవడం, మార్పులకు అవకాశం లేకపోవడంతో ఒకే రేషన్ కార్డులో తల్లిదండ్రులు, ఇద్దరు కొడుకుల పేర్లు ఉన్నాయి. ఇప్పుడు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటే, వారందరికీ కలిపి రూ.2 లక్షల రుణం మాత్రమే మాఫీ అవుతుంది. ఒకవేళ కొత్త రేషన్‌కార్డులు ఇచ్చి ఉంటే, ఆ కుటుంబానికి రూ.4.5 లక్షలు మాఫీ అయ్యేది. అందరూ రుణ విముక్తులయ్యేవారు. కానీ, ప్రభుత్వం కొత్త కార్డులు ఇవ్వకుండా రుణమాఫీ చేయడంతో ఆ కుటుంబం రూ.2.5 లక్షలు నష్టపోవాల్సి వస్తున్నది. అప్పుల ఊబి నుంచి బయటపడే పరిస్థితి కనిపించడం లేదు. కొన్నేండ్లుగా రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయలేదు. కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వలేదు. దీంతో సుమారు 10-12 లక్షల మంది కొత్త రేషన్‌కార్డులు, మార్పుల కోసం ఎదురు చూస్తున్నారు. రేషన్‌కార్డులకు సంబంధించి రాష్ట్రంలో పరిస్థితి ఈ విధంగా ఉంటే ప్రభుత్వం మాత్రం రుణమాఫీకి రేషన్‌కార్డులను ప్రామాణికంగా తీసుకోవాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో లక్షల మంది అర్హులు కూడా రుణమాఫీకి అనర్హులుగా మిగిలిపోయే ప్రమాదం ఏర్పడింది. కుటుంబం యూనిట్‌గా రుణమాఫీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యులను గుర్తించాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 90 లక్షల తెల్ల రేషన్‌కార్డులు ఉండగా ఇందులో 2.81 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. అయితే కొన్నేండ్లుగా రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. అదేవిధంగా కుటుంబ సభ్యులను చేర్చడం, తొలగించే అవకాశం కూడా లేకుండా పోయింది. దీంతో కొత్తగా పెండ్లి అయినవారు, కుటుంబం నుంచి వేరుపడినవారు కొత్త కార్డులు, మార్పుల కోసం ఎదురుచూస్తున్నారు. వీళ్లకు గతంలో అవకాశం లేకపోవడం, ఇప్పుడు కూడా అవకాశం రాకపోవడంతో అర్హులైనప్పటికీ రేషన్‌కార్డు దక్కలేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రభుత్వం రుణమాఫీకి రేషన్‌కార్డు లింకు చేయడంతో వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కొత్త రేషన్‌కార్డు లేకపోవడంతో అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ పొందలేకపోతున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు అన్ని పథకాలకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకొని అమలు చేస్తున్నది. దీనిపై గతంలోనే విమర్శలొచ్చాయి. కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకుండా పథకాలకు రేషన్‌కార్డును లింకు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో ప్రభుత్వం త్వరలోనే కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది. కానీ, అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా కొత్త కార్డుల జారీకి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు కూడా కొత్త కార్డులు జారీ లేకుండా రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించి రేషన్‌కార్డును లింకు పెట్టింది. ఈ నేపథ్యంలో కొత్త కార్డులు ఇవ్వకుండా రుణమాఫీకి రేషన్‌కార్డును ఏవిధంగా లింకు చేస్తారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

# 'ఆంక్షల' రుణమాఫీ!

- ***ఎన్నికలప్పుడు కోతలపై మాట్లాడని కాంగ్రెస్***
- ***అధికారంలోకి వచ్చాక ఎడాపెడ కోతలు***
- ***ఆర్థికభారం తగ్గించుకునేందుకు కఠిన నిబంధనలు***
- ***పీఎం కిసాన్, రేషన్‌కార్డు లింకుతో రైతులకు తీవ్ర నష్టం***

*హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటూ ఆశపెట్టిన కాంగ్రెస్ పార్టీ తీరా అధికారంలోకి వచ్చాక కొందరికే పరిమితం చేస్తున్నది. అప్పుడు ఎలాంటి ఆంక్షలు పెట్టబోమని చెప్పి.. ఇప్పుడు ఎడాపెడ కోతలు పెడుతున్నది. సోమవారం ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలే ఇందుకు నిదర్శనం. రుణమాఫీకి కుటుంబాన్ని గుర్తించేందుకు రేషన్‌కార్డును లింకు చేయడం, పీఎం కిసాన్ నిబంధనలను అమలు చేస్తామని పేర్కొనడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమనే విమర్శలొస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ తమను తీవ్రంగా మోసం చేసిందనే ఆగ్రహం రైతుల్లో వ్యక్తమవుతున్నది. రుణమాఫీలో పేర్కొన్న పలు నిబంధనలు రైతులను ఇబ్బంది పెట్టేలా ఉండటమే ఇందుకు కారణం. నిజానికి రుణమాఫీలో ఆంక్షలు పెట్టాలని ప్రభుత్వం ఎప్పుడో నిర్ణయించింది. పీఎం కిసాన్ నిబంధనలు అమలు చేస్తారంటూ నెల రోజుల క్రితమే తమ అనుకూల మీడియాకు లీకులు అందించారు. ఇప్పుడు ఆ ప్రకారమే ఆంక్షలు పెట్టి రుణమాఫీ అమలు చేస్తున్నది. తద్వారా మమ అనిపించి ప్రభుత్వంపై భారం పడకుండా, ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశామంటూ ప్రచారం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నదనే విమర్శలొస్తున్నాయి.*

### *కోతలు పెట్టి.. ఆర్థిక భారం తప్పించుకునేలా..*

*కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీకి దాదాపు రూ.40 వేల కోట్ల వరకు నిధులు అవసరమవుతాయనే అంచనాలున్నాయి. అది కూడా ఆగస్టు 15లోపు ఒకే విడతలో మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో తక్కువ సమయంలో అంత భారీ మొత్తం నిధులు సమకూరడం అసాధ్యంగా మారింది. దీంతో ప్రభుత్వం కోతలపై దృష్టి పెట్టిందనే విమర్శలొస్తున్నాయి. ఆర్థిక భారాన్ని తప్పించుకునేందుకు ఎక్కడ కోతలు పెట్టాలనేదానిపై కసరత్తు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల మాట్లాడుతూ.. రుణమాఫీకి రూ.31వేల కోట్లు అవసరం అవుతాయని చెప్పారు. ఆ నిధులు కూడా సమీకరించే సత్తా లేకపోవడంతో మరింత మందికి కోతలేస్తున్నారని, రేషన్‌కార్డు లింకు, పీఎం కిసాన్ నిబంధనలను అమలు చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఈ రెండు నిబంధనలతో రుణమాఫీ అర్హుల సంఖ్య సగానికి సగం తగ్గిపోతుంది. అప్పుడు ప్రభుత్వంపై ఆర్థిక భారం కూడా సగానికి సగం తగ్గిపోతుంది.*

## ఉద్యోగులకు రుణమాఫీ లేనట్టే

- **రేషన్‌కార్డు, పీఎం కిసాన్ నిబంధనల అమలే కారణం**
- **సుమారు 7 లక్షల కుటుంబాలకు నష్టం**

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ వర్తించే అవకాశం కనిపించడం లేదు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా మార్గదర్శకాల్లో పేర్కొన్న రెండు నిబంధనలు ఉద్యోగులకు మొండి చెయ్యి చూపించనున్నాయి. రుణమాఫీలో కుటుంబాన్ని గుర్తించేందుకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడం, పీఎం కిసాన్ నిబంధనలను వీలైనంత మేరకు అమలుచేయాలని నిర్ణయించడంతో ఉద్యోగులను రుణమాఫీ దక్కదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో సుమారు 7 లక్షల ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలు రుణమాఫీకి దూరమయ్యే అవకాశం ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 4 లక్షల మంది వర్కింగ్ ఉద్యోగులుండగా మరో 3 లక్షల మంది పదవీ విరమణ పొంది పెన్షన్ పొందుతున్నవారు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాగూ రేషన్‌కార్డు ఉండదు. రుణమాఫీ కోసం కుటుంబంలోని వ్యక్తులను లింకు చేయడానికి రేషన్ కార్డును ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకున్నది. కాబట్టి ప్రభుత్వ ఉద్యోగులకు రేషన్‌కార్డు లేకపోవడంతో వాళ్లు దీని పరిధిలోకి రారు. పీఎం కిసాన్ నిబంధనల ప్రకారం ఆ పథకానికి ప్రభుత్వ ఉద్యోగులు అనర్హులు. వీరితోపాటు రూ.10 వేలకుపైగా పెన్షన్ తీసుకుంటున్న రిటైర్డ్ ఉద్యోగులు కూడా అనర్హులే. దీంతో రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు రుణమాఫీకి దూరమయ్యే అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రుణమాఫీ గైడ్‌లైన్స్‌పై ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఎన్నికలప్పుడు ఎలాంటి నిబంధనలు లేకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు రేషన్‌కార్డు, పీఎం కిసాన్ అంటూ కొర్రీలు పెడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు మొండి చెయ్యి చూపడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ వ్యవసాయం చేసేవారు ఉన్నారని, పంట పెట్టుబడి కోసమే రుణం తీసుకున్నారని అంటున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

### ఉద్యోగులకూ రుణమాఫీ చేయాలి: సీపీఎస్ ఉద్యోగుల సంఘం

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కూడా రుణమాఫీని వర్తింపచేయాలని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. పాలనలో ప్రభుత్వానికి ఎంతగానో సహకరిస్తున్న ఉద్యోగులను ఆహార భద్రతకార్డు, పీఎం కిసాన్ నిబంధనలతో రుణమాఫీకి దూరం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా వ్యవసాయం కోసం రుణాలు తీసుకున్నారని, ఇచ్చిన హామీ మేరకు అందరికీ రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు.



## అవి రైతు వ్యతిరేక మార్గదర్శకాలు

- ***రీషెడ్యూల్ రుణాలనూ మాఫీ చేయాలి***
- ***మార్గదర్శకాలు రద్దు చేయాలి***
- ***మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి***

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు రుణమాఫీని ఎగ్గొట్టేలా, రైతులను మోసం చేసేలా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. రుణమాఫీకి రేషన్‌కార్డును, కుటుంబాన్ని ప్రాతిపదికగా తీసుకోవడం సరికాదని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్‌కార్డు లేకుండా వ్యవసాయ రుణం పొందినవారు అర్హులు కారా? అని ప్రశ్నించారు. రెండు బ్యాంకుల్లో రుణం తీసుకుని, ఒక బ్యాంకులో రూ. 2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉంటే మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తేనే రుణమాఫీ అనడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికిప్పుడు రైతుల మెడపై కత్తిపెట్టి చెల్లించమంటే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పేరున ఉన్న రుణాలకే ప్రాధాన్యం ఇస్తామనడం చూస్తుంటే ఇది రాజకీయ ప్రకటన అనిపిస్తున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను బట్టి 40 శాతం మంది రైతులకే రుణమాఫీ వర్తిస్తుందని, మిగతా 60 శాతం మంది రైతులు మోస పోయినట్టేనని ఆవేదన వ్యక్తం చేశారు. రీషెడ్యూల్ అయిన రుణాలకు రుణమాఫీ వర్తించదని చెప్పడం కూడా మోసమేనని పేర్కొన్నారు. రైతు ఏ బ్యాంకులో రుణం తీసుకున్నా రూ. 2 లక్షలు మాఫీ చేయాల్సిందేనని, లేదంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరగలేరని, మంత్రులు జిల్లాలకు రాలేరని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు ఎలాంటి షరతులు లేకుండా రుణాలు మాఫీ చేసిందని గుర్తు చేశారు. రైతులు రోడ్లపైకి రావడానికి ముందే మార్గదర్శకాలను రద్దు చేయాలని సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు.